క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలలో వ్యాపారులు, సామాజిక సంఘాలు, క్లబ్‌లు, నారాయణస్వామి ఫైనాన్స్, నెహ్రూ చౌక్, రైతుబజార్, మార్కెట్ సెంటర్, తదితర ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ సోమవారం కూడా కొనసాగింది. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 22వ రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండతీవ్రత తగ్గేవరకు ఈ పంపిణీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జి ప్రభాకరరావు, ఎంపీ సత్యనారాయణ, వెంకట్, చంద్రశేఖర్, బ్రహ్మజీ, రామకృష్ణ, ఉమ పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



మొవ్వ: మొవ్వ మండలంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు జగనన్న విద్యాకానుకల కిట్ల పంపిణీని కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించారు. తొలి రోజు నిడుమోలు కాంప్లెక్స్ పరిధిలోని నిడుమోలు, మంత్రిపాలెం, అవురిపూడి పంచాయతీల పరిధిలోని జెడ్పీ, ఎంపీ పాఠశాలలకు 438 మంది విద్యార్థులకు సరిపడా కిట్లను ఆ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ అన్నపూర్ణకు ఎంఈఓ ఎస్.శివశంకరరావు పర్యవేక్షణలో అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు కృష్ణార్జునరావు, ఆంజనేయులు, నాగరాజు, సమర్పణరావు, సీహెచ్ శ్రీమన్నారాయణ, హిమజ పాల్గొన్నారు.

కౌలు రైతుకు నేరుగా కార్డు ఇవ్వాలి

గుడివాడ టౌన్: కౌలు రైతుకు ప్రభుత్వం ఇస్తున్న అన్ని పథకాలు నేరుగా కౌలు రైతుకే చేరేలా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం కౌలు రైతుల డిమాండ్‌ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు కార్డు యజమాని సంతకంతో సంబంధం లేకుండా రైతుకు అందజేయాలన్నారు. కౌలు రైతు పేరుతోనే ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు. పంట బీమా నష్టపరిహారం కౌలు రైతు ఖాతాలోనే జయ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, కౌలురైతు సంఘం కార్యదర్శి సంపంగి గణపతిరావు, మాతంగి కృష్ణ, ఐద్వా కార్యదర్శి పి రజిని పాల్గొన్నారు.

వీఆర్వో దేవేంద్ర మృతి



దేవేంద్ర మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

ముదినేపల్లి రూరల్: మండలానికి చెందిన వీఆర్వో దేవేంద్ర(58) సోమవారం మృతి చెందారు. దేవేంద్రకు భార్య, కుమార్తె ఉన్నారు. మండలంలోని చిగురుకోటకు చెందిన దేవేంద్ర 30 ఏళ్లుగా మండలంలోని పలు గ్రామాల్లో వీఆర్వోగా పని చేస్తూ గతేడాది ముసునూరు మండలం సూరేపల్లి గ్రామ వీఆర్వోగా బదిలీపై వెళ్లారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ముదినేపల్లిలోని నివాసంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ దేవేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో వీఆర్వోల మండల సంఘం నేత కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, రంగిశెట్టి కొండా, రాచూరి కుమార్, దివి సతీష్, పేర్ని పృధ్వీ ఉన్నారు.

గృహాలను వెంటనే నిర్మించుకోండి

డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్



గుడ్లవల్లేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీల్లో గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన లబ్ధిదారులతో సోమవారం మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా, ఏరియా కో–ఆర్డినేటర్ సుందరరావు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు పాటుపడాలి

ఉయ్యూరు సివిల్ జడ్జి శ్రీహరి



తోట్లవల్లూరులో మొక్కను నాటుతున్న ఉయ్యూరు సివిల్ జడ్జి శ్రీహరి

తోట్లవల్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఉయ్యూరు సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం సాయంత్రం మొక్కను నాటారు. అనంతరం మండల పరిషత్ సమావేశపు హాలులో పర్యావరణ పరిరక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. మొక్కలు లేనిదే ప్రాణవాయువు లేదని, ప్రతిఒక్కరూ విధిగా మొక్కను నాటాలని శ్రీహరి చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా నిరోధించాలన్నారు. బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను అందించాలని సూచించారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎస్ఐ జి.రమేష్, ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, ఉపాధ్యక్షుడు పల్లి అశోక్ పాల్గొన్నారు.

ర్యాలీ..

గుడివాడ టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణ, వాతావరణ కాలుష్య నియంత్రణతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం వలన పర్యావరణ సమతుల్యాన్ని పాటించవచ్చన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు కాలుష్యమే కారణమని దానిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

- స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శివనాథ్, బీఎస్ఎస్ పద్మజ, కె సుభాషిణి, కె సుధాకర్, డి విమలకుమారి పాల్గొన్నారు.
- స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఏస్‌డీఓ ఎస్ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర, ట్రైనింగ్ ఆఫీసర్లు ఆనంద్‌వేణు, నరసింహాచారి, శేషుబాబు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణంపై వివరిస్తున్న విద్యార్థిని



మండవల్లి గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ ఝాన్సీ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

జమీగొల్వేపల్లి (పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులకు అవగహన కల్పించారు. మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషారాణి, గ్రంథాలయాధికారి నాగసురేష్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి తెలిపారు. మండలంలోని చోరగుడి గ్రామంలో సోమవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎఫ్‌ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణ, ఎఫ్‌ఎంసీ కంపెనీ ఎంఐఈ వాసు పాల్గొన్నారు.

ఉద్యమంగా కదిలిరావాలి

మండవల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ఉద్యమంగా కదిలిరావాలని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎస్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండవల్లి హైస్కూల్లో ఐక్య వేదిక మండల శాఖ, సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, హైస్కూల్ హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు యు.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దుర్గమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

సచివాలయంలో ..

మండవల్లి: మండవల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన పర్యావరణ దినోత్సవ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఆదా, నీటి ఆదా, ప్లాస్టిక్ వస్తువల వినియోగం తగ్గించడం, ఆరోగ్యవంతమైన జీవనశైలి తదితర విషయాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ముదినేపల్లి రూరల్: మానవాళి మనుగడ కోసం పర్యావరణాన్ని కాపాడుకుందామని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ ప్రాధాన్యత గురించి సోమవారం విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బోధించడంతో పాటు ఇండోర్‌గేమ్స్ పోటీలను నిర్వహించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు, కపిలేశ్వరపురం, గురజాడ, పమిడిముక్కల, మేడూరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అగినపర్రు గ్రంథాలయంలో చిన్నారులు పుస్తకపఠనం చేశారు. మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్ ఆడించారు. విజేతలకు 11న బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ బొబ్బా లావణ్య తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక దృఢత్వం



మండవల్లి: యోగాతో మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం యోగాసనాలపై పిల్లలకు అవగాహన కల్పించారు.

మండల పరిషత్ కార్యాలయ ఏఓగా రాజు

పమిడిముక్కల: మండల పరిషత్ కార్యాలయ ఏఓగా కేఎస్‌డీరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చందర్లపాడు మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓ సుధా ప్రవీణ్ నుంచి ఏఓగా ఆర్డర్ తీసుకున్నారు. కార్యాలయ సిబ్బంది రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

డయేరియా వచ్చిన పిల్లలకు జింక్ అందించాలి



డయేరియా నివారణ మందులను అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

కురుమాద్దాలి(పామర్రు): డయేరియా వచ్చిన చిన్న పిల్లలకు 14 రోజుల పాటు జింక్, ఓఆర్ఎస్ తప్పనిసరిగా అందించాలని కనుమూరు పీహెచ్‌సీ వైద్యుడు పి.వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని కురుమాద్దాలిలో డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్(ఐడీసీఫ్) కార్యక్రమంపై సోమవారం ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ విరోచనాల సమయం, అనంతరం చిన్నారులకు నోటి ద్వారా ద్రావణాలు అనుసంబంధ ఆహారం నిర్విరామంగా అందించాలన్నారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు.

నీళ్ల విరేచనాలతో అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు: నీళ్ల విరేచనాలతో ఐదేళ్ల లోపు పిల్లలు అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పేర్కొన్నారు. ఉద్ధృత అతిసార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీ వరకు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు గృహదర్శనం ద్వారా ఐదేళ్ల లోపు పిల్లలు విరేచన వ్యాధితో బాధపడుతుండటాన్ని గుర్తిస్తారని డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడంతోపాటు ఆ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కలిగిస్తారన్నారు. ఈ కార్యక్రమం అమలు తీరును జిల్లా మానిటరింగ్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు మండలంలోని పలు గ్రామాల్లో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక గ్రామానికి చెందిన దూసనపూడి వెంకటేశ్వరరా వు వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో గ్రా మంలో పింఛను పొందే అవకాశం లేకుండాపోయింది. సంబంధిత వలంటీర్ కత్తుల వెంకట శ్రీలక్ష్మీ సోమవారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావుకు పింఛన్ అందజేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

దోసపాడు(పెదపారుపూడి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మండలంలోని దోసపాడు గ్రామంలో ఆదివారం రాత్రి కోడి పందేల శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.6,800, రెండు కోడి పుంజులు, 14 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పల్లా నాగకల్యాణి తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణం కోసం బాధ్యతగా మెలగాలి

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మెలగాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ మాట్లాడుతూ రామ్‌సార్ సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు మాత్రమే అన్నారు. నేటి తరం కొల్లేరు పర్యావరణాన్ని సంరక్షించి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. కొల్లేరులో పక్షులు, ప్రజలు రెండు ముఖ్యమే అన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో నియోజకవర్గంలో అదనంగా ధ్వంసం చేసిన 7,500 ఎకరాల భూములను తిరిగి పేదలకు పంపిణీ చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణాల కల త్వరలో సాకారమవుతుందన్నారు. విద్యార్థులకు పర్యావరణాన్ని ప్రత్యేక అంశంగా పుస్తకాల్లో చేర్చాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను అందరూ విడనాడాలన్నారు. ఇన్‌చార్జి డీఎఫ్ఓ ఎం.హిమ శైలజా మాట్లాడుతూ కేంద్రం మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రేంజర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీలో కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతంతో పాటు కొరింక, అవనిగడ్డ వంటి మడ ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని అటవీ శాఖ నిర్వహించిందన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. చిత్రలేఖనంలో కె.సాఫియా సుల్తానా, ఏ.జాహ్నవి, ఎం.దీప్తిలు మొదటి మూడు స్థానాలు సాధించారన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, పర్యావరణ అధ్యాయన కేంద్ర కమిటీ అధ్యక్షుడు వడ్లాని సుబ్బారావు, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు రామ్ మోహన్‌సింగ్, ఖారీం, ఫారెస్టు బీటు ఆఫీసర్ కావడి వెంకన్న, రాజేష్, కృష్ణంరాజు, సౌజన్యకుమార్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ప్రసంగం..

పక్షుల కేంద్రం వద్ద న్యూ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యావరణంపై చేసిన ప్రసంగాన్ని వీక్షించడానికి భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణ కోసం స్పష్టమైన రోడ్ మ్యాప్, తొమ్మిది సంవత్సరాల్లో దేశంలో చిత్తడి నేలలు, రామ్‌సార్ సైట్లు సంఖ్య మూడు రెట్లు పెరిగాయని చెప్పిన ప్రసంగాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు. పర్యావరణ పోస్టర్లను అవిష్కరించిన అనంతరం అటవీశాఖ పెలికాన్ పక్షుల చిత్రంతో ఏర్పాటు చేసి సెల్ఫీ బోర్డు వద్ద పలువురు ఫొటోలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

గుడివాడ టౌన్: స్థానిక బేతవోలు మున్సిపల్ హైస్కూల్ 2001–02 పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక సోమవారం జరిగింది. తొలుత విద్యార్థులు తమకు విద్యనేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పలు ప్రాంతాల్లో ఉద్యోగ వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన వారంతా ఒకే చోటచేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.సంధ్య పాల్గొన్నారు.

అన్నసమారాధన



పూజలు నిర్వహిస్తున్న దూలం వినయ్

ముదినేపల్లి రూరల్: మండలంలోని చేవూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన చేశారు. స్వామి వారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా సమారాధన ఏర్పాటు చేశారు. దీనిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం వీరఆదివినయ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత ఆలయంలో స్వామివారికి పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, సర్పంచ్ వల్లభనేని లక్ష్మీవెంకట్రావు, స్థానిక సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఆలయ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు రాచూరి కుమార్, దివి సతీష్, దూసనపోయిన ఆంజనేయులు, నేతల రాజేష్, వల్లభనేని సంపూర్ణ పాల్గొన్నారు.

శరవేగంగా పైప్‌లైన్ పనులు



పెయ్యేరులో పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

ముదినేపల్లి రూరల్: గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పెయ్యేరు పంచాయతీ పరిధిలో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ శివారు బంటుమిల్లి రోడ్డులోని సినిమా థియేటర్ వద్ద నుంచి సుమారు 600 మీటర్ల పొడవునా హెచ్‌డీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు రూ.4.70 లక్షలతో ఈ పనులను చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కృష్ణారావు తెలిపారు.

పైప్‌లైన్ లేనందు వల్ల స్థానిక ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జాస్తీ బాబు రాజేంద్రప్రసాద్ నిధుల విడుదలకు కృషి చేసి పనులను పర్యవేక్షిస్తున్నారు.

చురుగ్గా 'నాడు-నేడు' పనులు



నరసన్నపాలెం పాఠశాలలో ప్లంబింగ్ పనులు చేస్తున్న దృశ్యం

ముదినేపల్లి రూరల్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే ధ్యేయంతో చేపట్టిన నాడు–నేడు పనులు మండలంలో చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగానే చిగురుకోట శివారు నరసన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పాఠశాల అభివృద్ధికి రూ.13 లక్షలు నిధులు కేటాయించగా మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయి. ప్రస్తుతం మరుగుదొడ్లకు, వాటర్ ట్యాంకుకు నీరందించేందుకు చేపట్టిన ప్లంబింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఈ పాఠశాల ఎలాంటి అభివృద్ధికి నోచుకోపోగా ప్రస్తుతం చేపట్టిన నాడు–నేడు పనులతో రూపురేఖలే మారిపోయినట్లు ఉపాధ్యాయుడు ఆర్.శ్రీహరి అన్నారు.

చెరువుల అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఏలూరు (టూటౌన్): అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు నిలుపుదల చేసి మండవల్లి మండలం కానుకొల్లు దళితపేటను కాపాడాలంటూ సీపీఎం, ఏపీ రైతు సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండవల్లి మండలం కానుకొల్లు దళిత పేట కాలనీని ఆనుకుని ఉన్న పంట పొలాలను అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, మాల మహాసేన జాతీయ కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, సీఐటీయూ నాయకులు రాయగిరి రాము పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు కృష్ణాజిల్లా, కైకలూరు గ్రామ కాపురస్థులు 1.అన్నం వెంకటేశ్వరరావు గారి కుమారుడు [illegible] 2. [illegible] ... నం.148/1881 ... ది 24-04-2016 ... ది.24-08-2020 ... 2541/2020 ... [illegible] ... 484.0 ... 404.6 ... [illegible]

ఏ. రామమోహనరావు, దాసు లక్ష్మణ కుమార్, ఎ.రాజరాజేశ్వరి, అడ్వకేట్స్,
డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11. సెల్: 9392114822